క్లుప్తంగా

సబ్‌జైళ్ల పరిశీలన



విజయనగరం సబ్ జైల్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి, తదితరులు

విజయనగరం క్రైమ్: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయి కల్యాణ్ చక్రవర్తి విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి సబ్‌జైళ్లను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముద్దాయిలకు కల్పిస్తున్న వసతులు, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి, సబ్ జైల్ సూపరింటెండెంట్‌లు, కోర్టు సిబ్బంది, సబ్ జైల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పసపాంలో హైనా కలకలం..



పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామ పరిసరాలలో హైనా కలకలం సృష్టించింది. గ్రామస్తులు దూరం నుంచి హైనాను చూసి పులి సంచరిస్తుందేమోనని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం వారు గ్రామానికి చేరుకుని పాదముద్రలు పరిశీలించగా.. అవి హైనా పాదముద్రలుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ అధికారి పి. మధుసూదనరావు మాట్లాడుతూ, భోగాపురం మండలం దిబ్బలపాలెంలో కూడా హైనా సంచరించినట్లు పాదముద్రలు గుర్తించామన్నారు. రెండు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు ఫారెస్ట్ బీట్ అధికారి జి. పూజ, అసిస్టెంట్ బీట్ అధికారి కె.కృష్ణ, తదితరులు ఉన్నారు.

డీజే సౌండ్స్ వినియోగించవద్దు

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు



డీజే సౌండ్స్ యజమానులతో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసినప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కార్యక్రమాల్లో డీజే సౌండ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు నిర్వాహకులను హెచ్చరించారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం పట్టణంలోని వివిధ లైటింగ్స్, డీజే సౌండ్స్ యజమానులతో సమావేశం నిర్వహించారు. కోడ్ అమల్లో ఉన్నందున ఏ కార్యక్రమాల్లోనూ డీజే సౌండ్స్ వినియోగించవద్దని కోరారు.

సిరిమానుకు ప్రత్యేక పూజలు



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో అసిరితల్లి పండగ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారి సిరిమానుకు మహిళలు ముగ్రాటలు, పసుపు, కుంకమతో పూజలు చేశారు. అసిరితల్లి అమ్మవారి గుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

జామి: కుమరాం గ్రామం, కల్యాణ్‌నగర్‌లోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం, స్వామి వారి జయంతి ఉత్సవాన్ని ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా చేపట్టాలి..

- పోస్టల్ బ్యాలెట్‌ల తరలింపులో కూటమి అభ్యర్థుల అపోహలు సరికాదు
- అధికారులు సూచించిన విధంగానే నా తరఫున ఏజెంట్లను పంపించా
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సార్వత్రిక ఎన్నికలు ఎంత ప్రశాంతంగా జరిగాయో, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా అంతే సజావుగా జరగాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్ష వ్యక్తం చేశారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేవలం రాజకీయాలే తప్ప సిద్ధాంతపరంగా ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేసే స్వభావం తనది కాదన్నారు. కూటమి అభ్యర్థులు అపోహలకు పోయి పోస్టల్ బ్యాలెట్ తరలింపులో ఏదో జరిగిపోయినట్లు మాట్లాడుతున్నారని, ఇది సరికాదని సూచించారు. మా వరంగా ఎటుఏవంటి తప్పు జరిగేందుకు ఆస్కారం ఇవ్వమని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు తరలింపు సమయంలో అధికారులు తనకు సమాచారం ఇచ్చారని, ఆ సమయంలో తనకు వీలుకాకపోవడంతో ఏజెంట్లుగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్‌లను పంపించినట్లు చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో గెలుపోటములను హుందాగా స్వీకరించానే తప్ప, ఎవ్వరినీ ఎటువంటి ఇబ్బందులకు గురిచేయలేదని స్పష్టం చేశారు. ఏ పదవి చేపట్టినా చిత్తశుద్ధితో విధులు నిర్వహించానని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా ప్రజలకు సహాయ సహకారాలు అందించామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరగాలని ప్రతిపక్ష నేతలు ఏ విధంగా కోరుకుంటున్నారో తాము కూడా అదేవిధంగా కోరుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, ముచ్చు శ్రీనివాసరావు, మారం బాల బ్రహ్మారెడ్డి, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి తొలేళ్లు..



వెంపడాం గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై సన్యాసినాయుడు, సిబ్బంది

- వెంపడాంలో 60 ఏళ్ల తర్వాత పండుగలు
- నేడు రథయాత్ర

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం పైడితల్లి పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామం మధ్యలో ఉయ్యాల ఏర్పాటు చేసి గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఉత్సవం జరిపించారు. సంబరాల్లో భాగంగా వెంపడాం ముఖ ద్వారం నుంచి తాళ్లపేట వరకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెంపడాంలో కొలువైన పైడితల్లి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. అమ్మవారిని కొలిస్తే సమస్యలు తీరిపోయి, సుఖశాంతులు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఏ ఇల్లు చూసినా బంధువులతో కళకళలాడింది.



పైడితల్లి చదురు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

అంజలి రథోత్సవం

వెంపడాం గ్రామం ముఖద్వారం నుంచి గ్రామం శివారు వరకు మంగళవారం అంజిలి రథోత్సవం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు, పూసపాటిరేగ ఎస్సై ఎ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్ఎం రాజు

బాడంగి: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజనల్ మేనేజరు డీఆర్‌కే రాజు అన్నారు. స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంక్ బ్రాంచ్‌ను కొత్తభవనంలోకి మార్పు చేయగా.. ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాతభవనం ఇరుకుగా ఉండటం వల్ల ఖాతాదారులు ఇబ్బందులు పడేవారని, అందుకే విశాలమైన కొత్త భవనంలోకి మార్పుచేసినట్లు చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సేవలతో పాటు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కె.ప్రసాద్, సునీల్‌వర్మ, డి.గణేష్, యూనియన్ జనరల్ సెక్రటరీ గంట అప్పల నాయుడు, స్థానిక బీఎం బి.వెంకటేష్, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు



పరీక్షకు హాజరైన విద్యార్థులు

లక్కవరపుకోట: మండలంలోని తలారి గ్రామంలో సత్యవతమ్మ పేరంటాలు ఆలయ వార్షికోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా 6వ తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రతిభా పోటీల పరీక్షకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 280 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2 వేలు, రూ.1500 చొప్పున, 7 నుంచి 20వ స్థానం వరకు సాధించిన విద్యార్థులకు వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతులను గుమ్మడి సత్యనారాయణ, ఆయన సోదరుడు గుమ్మడి రామకృష్ణ అందజేశారు. అలాగే పరీక్ష హాజరైన విద్యార్థులకు ప్లాంక్‌లు, తెలుగు కాపీ రైట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్టడీ మెటీరియల్ అందజేశారు.

మెగా వైద్యశిబిరం

సత్యవతమ్మ పేరంటాలు ఆలయ వార్షికోత్సవం సందర్భంగా విశాఖపట్నానికి చెందిన మెడీ కవర్ ఆస్పత్రి సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 230 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పలువురికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. వైద్య శిబిరాన్ని జిల్లా సహకార సంఘం చైర్మన్ వేచలపు చినరామునాయుడు సందర్శించి, నిర్వాహకులు సత్యనారాయణ,రామకృష్ణను అభినందించారు. మధ్యాహ్నం ఆలయం ప్రాంగణంలో అన్నదానం చేశారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీసీబీసీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు తదితరులు

నగదు చెల్లింపుల్లో జాప్యం తగదు

విజయనగరం అర్బన్: ఏపీజీఎల్ఐలో దాచుకున్న నిధుల మెచ్యూరిటీ బాండ్‌లకు నగదు చెల్లింపుల్లో జాప్యం చేయొద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏపీజీఎల్ఐ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుధారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ ప్రతినిధులు మాట్లాడుతూ, ఏపీజీఎల్ఐ అకౌంట్‌లో ఉన్న మిస్సింగ్ క్రెడిట్ సరిచేయాలని కోరారు. పెంపుదల చేసిన నూతన బాండ్లను మంజూరు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న రుణాలను విడుదల చేయాలని కోరారు. అసిస్టెంట్ డైరెక్టర్‌ని కలిసిన వారిలో సంఘ నాయకులు జోగారావు, చిప్పాడ సూరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

భోగాపురం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెట్రోల్‌బంక్ నిర్వాహకులు సీసాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయించరాదని సీఎస్‌డీటీ జగన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. ఎవరైనా సీసాల్లో, కంటైనర్లలో విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

అనుమతులుంటేనే ఇసుక తవ్వకాలు



చంపావతి నదిలో ఇసుకతవ్వకాలు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: ఎటువంటి అనుమతుల్లేకుండా నదుల్లో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని మైనింగ్ విజిలెన్స్ ఎ.డి బి. విజయలక్ష్మి అన్నారు. మైన్స్ డీడీ సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు సోమవారం స్థానిక చంపావతి నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇసుక అక్రమంగా తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి, నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. అంతేకాకుండా తాగునీటి పథకాలకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో మైనింగ్, ఎస్ఈబీ బృందం పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

చీపురుపల్లి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ కూడా అంతే ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో చీపురుపల్లి మండంలోని గొల్లలములగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉన్న సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అభ్యర్థులు, పార్టీల గెలుపు, ఓటములపై పందాలు కాయడం, గొడవలకు దిగడం చేస్తే కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కేసుల్లో ఇరుక్కొని యువత జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఒక్కసారి పోలీస్ కేసు నమోదైతే జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు, అన్ని పార్టీల నాయకులు సంయమనం పాటించి గొడవలు లేకుండా చూసుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇరు పార్టీలకు చెందిన వారితో బైండోవర్ నమోదు చేస్తున్నట్లు చెప్పారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

లక్కవరపుకోట: ఎన్నికల కోడ్ ఇంకా అమలులో ఉందని, ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లకు పాల్పడినా, తగాదాలు సృష్టించినా చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.గోపాలరావు హెచ్చరించారు.మండలంలోని గనివాడ, నిడుగట్టు గ్రామాల ప్రజలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాల్లో సభలు,సమావేశాలు నిర్వహించరాదన్నారు.అలాగే ఫలితాలు రోజున బాణసంచా కాల్చడం వంటివి చేయరాదన్నారు.

ముందస్తు నివారణ చర్యలు చేపట్టండి

- ఎంపీపీ అనూషారెడ్డి



సమావేశంలో మాట్లాడుతన్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: వేసవి ఎండలు ఎక్కువగా ఉండడంతో పాటు సింగపూర్ దేశంలో కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో మండలంలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రకళ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి మాట్లాడుతూ.. కోవిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారు బయటకు వెళ్లే సమయంలో మాస్కులు ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ప్రజా సమస్యలపై చర్చించకుండానే సమావేశం ముగించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దంతులూరి రావాడబాబు, పడాల సత్యవతి, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోగికి భద్రత కల్పించేలా పరిశోధనలు జరగాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: రోగికి భద్రత కల్పించే విధంగా పరిశోధనలు జరగాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో అంతర్జాతీయ క్లినికల్ ట్రయల్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లినికల్ ట్రయల్స్ రోగులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి ఆర్ఎంఓ ఎస్. సురేష్‌బాబు, డాక్టర్ తిరుమల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ శశిభూషణ్, తదితరులు

నెల్లిమర్ల: నగరంలోని మిమ్స్ ఆసుపత్రిలో వెన్నెముకకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ శశిభూషణరావు తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయనగరం పట్టణ పరిధిలోని వీటీ అగ్రహారానికి చెందిన ఎ. జ్యోతి (33) పుట్టుక నుంచి వెన్నెముక వైకల్యంతో బాధపడుతోందన్నారు. విపరీతమైన వెన్ను నొప్పితో పాటు రెండు కాళ్ల తిమ్మిర్లతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిందని చెప్పారు. ఆమెకు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు ఆరు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి వెన్ను వంకరను సరిచేశామన్నారు. ఇటువంటి శస్త్రచికిత్స విజయనగరంలో ఇదే తొలి సారని తెలిపారు. అనంతరం జ్యోతి మాట్లాడుతూ, ఎన్నో ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. చివరకు మిమ్స్‌కు రాగా.. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు యశ్వంత్, విజయభూషణ్, రాజశేఖర్, సతీష్, ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరువీధి



హనుమద్వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



మహిళల కోలాటం

విజయనగరం టౌన్: తోటపాలెంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ తిరుక్కల్యాణ, అష్టోత్తర శతకలశ స్నపన మహా కలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రధానార్చకుడు పణిహారం రంగాచార్యుల ఆధ్వర్యంలో హనుమత్ వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలు ఉంచి తిరువీధి చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల కోలాటం, చిన్నారుల నృత్యం అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యభగవాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వేసవి శిక్షణ తరగతులు



అందుకున్న పుస్తకాలతో చిన్నారులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఆకట్టుకుంటున్నాయి. తరగతుల్లో భాగంగా సోమవారం పుస్తక పఠనం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా షణ్ముఖప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంగీతం, చిత్రలేఖనం వంటి కళలలో శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానవంతులు కావాలన్నారు. 24 రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ కళాప్రదర్శనలు చేపట్టిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.